# వసంతసేన

హైదరాబాద్ నుంచి వైజాగ్ వెళ్ళే గోదావరి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫారమ్ మీదకు వచ్చిన పావుగంటకు హడావుడిగా తన కోచ్‌కు చేరుకున్నాడు గౌతమ్. తన బెర్త్ వెతుక్కుని స్థిమితంగా కూర్చునే సరికి మరో పావుగంట పట్టింది. ఇంతలో మల్లెపూల సౌరభం అతడి ముక్కుపుటాల్ని తాకింది. తలతిప్పి చూశాడు. ఎదురుగా ఒక అమ్మాయి. కంగారులో తాను గమనించలేదు.

మీగడ రంగు తెలుపు, మోచేతివరకూ రంగురంగుల పూసల గాజులు, ముక్కపుడక, చెమ్కీలున్న జాకెట్టు, విరబూసిన మొగ్గలా వున్న ఆ అందగత్తెను ఆశ్చర్యపడుతూ చూస్తున్నాడు గౌతమ్.

తలతిప్పి ఆమె చూసే సరికి కిటికీ వైపు దృష్టి సారించాడు. రెండు, మూడు సార్లు ఆమెను అలా చూశాక నాలుగోసారి మాత్రం ఆమె ఫకాలుమని నవ్వేసింది. తప్పదనుకుని గౌతమూ నవ్వేశాడు.

ఇద్దరి మధ్య మాటలు దొర్లాయి. ఆమె ముందుగా నోరు విప్పింది.

"ఎక్కడికి వెళుతున్నారు?" అంది.

"వైజాగ్" అంటూ ఆమె కళ్లలోకి చూసి "మరి మీరు"! అన్నాడు గౌతమ్.

"అనకాపల్లి" అంది ఆమె.

"ఏం చేస్తున్నారు?" అన్నాడు గౌతమ్ సంభాషణ పొడిగిస్తూ.

"హోమ్ సైన్స్‌లో పిజి చేశాను. ఉద్యోగ ప్రయత్నంలో వున్నాను" అంది ఆమె.

"నేను తెలుగు సాహిత్యంలో ఎమ్మే చేసి యూనివర్శిటీలో లెక్చరర్‌గా వుంటున్నాను" అన్నాడు గౌతమ్. ఆమె అడక్కుండానే.

గౌతమ్‌కు ఆమె పేరు తెలుసుకోవాలనిపించింది. తన పేరు చెప్పి "మరి మీ పేరు!" అన్నాడు. ఆమె క్షణం సేపు ఆలోచించి, "మీరు తెలుగు పండితులు కదా, నా పేరేంటో చిన్న ఫజిల్‌లా చెబుతాను తెలుసుకోండి. నా పేరులో సగం ఒక ఋతువు, మిగతా సగం ఒక రాజుగారికుండేది" అందామె అతని వంక సూటిగా చూస్తూ.

వెంటనే గౌతమ్, "మీ పేరు వసంతసేన" అన్నాడు హుషారుగా.

"భలే చెప్పేశారే!" అంటూ ఆమె అతడి వంక మెచ్చుకోలుగా చిసింది.

గౌతమ్ ఆమె మాటలకు ఆనందపడ్డాడు. తన సూట్ కేసులోంచి రేడియో తీసి ఆన్ చేశాడు.

వాతావరణం చల్లగా వుంది మెల్లగా పరుచుకుంటున్న చీకటి తెరలు. కిటికీలోంచి చూస్తే ఆకాశంలో మిణుకుమిణుకు మంటున్న నక్షత్రాలు. అలాంటి వాతావరణంలో ఘంటసాల పాట.

"చికిలింత చిగురు, సంపంగి గుబురు చినదానీ మనసు - చినదాని మీద మనసు".

రేడియోలో వస్తున్న ఆ పాట వింటూ ఆమె వంకే ఓరగా చూస్తూ వుండి పోయాడు.

వసంతసేన కూడా మంత్రముగ్ధలా ఆ పాట వినడంలో లీన మయింది.

మళ్ళీ మరోపాట.

- "కలనైనా నీ వలపే - కలవరమందైనా నీ తలపే"

పాటలు అయిపోయే వరకూ ఇద్దరి మధ్యా మాటలు లేవు. ఆ తర్వాత అంది "మీరు తెలుగు మాష్టారు కదా, కవితలు, పాటలు రాస్తారా" అంది.

"నేను రాయను. బాగా రాసిన వారివి చదివి ఆనందిస్తాను. నా మిత్రుడు భాస్కర్ రాసిన జానపదగీతం లోని ఈ వ్యాఖ్యలు వినండి.

కారు చీకటి కంటి కాటుకవుతానంది.

తూరుపెరుపంతా నొసట తిలకమవుతానంది.

వేగుచుక్క నీకు ముక్కెరవుతానంది.

గుండె గొంతుక చేరి నీకు దగ్గరవుతానంది.

అతను రాగయుక్తంగా పాడుతుంటే ఆమె కళ్లు మూసుకుని తాదాత్మ్యంగా వింటోంది. ఇంతలో ట్రెయిన్ ఆగిపోయింది. చాలా సేపటి వరకూ తిరిగి బయలు దేరే సూచనలు కనబడలేదు. గౌతమ్ ట్రెయిన్ దిగాడు బిస్కట్లు, పళ్లు కొందామని, ఐదు నిముషాలు తర్వాత తిరిగి వస్తుంటే ఆమె ఆయాసపడుతూ ఎదురొచ్చింది. గౌతమ్‌కు ఏమీ అర్థం కాలేదు. ఆమె కళ్లల్లో తడి.

"ఏమయ్యింది!" అన్నాడు కంగారుగా.

"ఎవరో ఇద్దరు కుర్రాళ్లు కంపార్టుమెంటు ఎక్కి ఏడిపిస్తున్నారు. భయపడి వచ్చేశాను...." అంది.

"ఫర్వాలేదు. నేనున్నాను..." అంటూ ఆమె చెయ్యిపట్టుకుని ముందుకు నడిచాడు. ఆమె బెర్త్ ఎక్కి పడుకుంది. కళ్లు తెరిచి భయం భయంగా చూస్తోంది.

"భయపడకండి. ప్రశాంతంగా పడుకోండి. నేను మెలకువగానే వుంటాను" అన్నాడు. ఆమె అతడి వంక కృతజ్ఞతగా చూసి నిద్దట్లోకి జారుకుంది.

తెల్లారి పోయింది. వసంతోసేన నిద్రలోంచి లేచి చూసేసరికి కూర్చునే కునికిపాట్లు పడుతున్న గౌతమ్.

“అయ్యో...నా కోసం రాత్రంతా మెలకువగా వున్నారా?” అంది.

“ఫరవా లేదులేండి” అంటూ లేచి నించోబోయాడు. అతడి శరీరం తూలింది.

“ఏమయింది!? అంటూ ఆమె అతడి నుదుటి మీద చెయ్యివేసింది. ఆమెకు వెచ్చగా తగిలింది.

“అయ్యో జ్వరం వచ్చినట్టుంది” అంది. గౌతమ్ లేవలేక కూర్చుండి పోయాడు. ఐదు నిముషాలకు కడుపులో తిప్పినట్టయింది. నించోవడానికి ప్రయత్నించినా కళ్లు తిరగడంతో అలాగే వుండిపోయాడు. ఆమెకు అతడి బాధ అర్థమయింది. మెల్లగా అతడిని వాష్‌బేసిన్ వరకూ నడిపించి, అతడి రెండు చెవులూ మూసింది. అలా చెయ్యడం అతడికి చాలా రిలీఫ్‌గా అనిపించింది. కడుపులోది ఖాళీ అవడంతో ప్రాణం లేచివచ్చినట్టయింది. మళ్లీ బెర్త్ వరకూ ఆమె సాయపడింది. బెర్త్‌పై పడుకుని కళ్లు మూసుకున్నాడు. “టాబ్‌లెట్‌లు నా దగ్గరున్నాయి. అని వేసుకుని పడుకోండి ఉదయం కల్లా సర్దుకుంటుంది” అలా అంటూ తన బేగ్‌లోంచి టాబ్లెట్లు తీసి మంచి నీళ్లతో పాటు ఇచ్చింది.

ఏ పరిచయమూ లేకుండానే తనకు సేవచేస్తున్న ఆమెను గురించి ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు.

ట్రెయిను వైజాగు స్టేషను చేరగానే గౌతమ్‌కు మెలకువ వచ్చింది. పై బెర్త్ చూసి కంగారుపడ్డాడు. అది ఖాళీగా వుంది. తన గుండెగది ఖాళీ అయినట్టుగా బాధపడ్డాడు.

‘ఆమె అనకాపల్లిలో దిగి పోయినట్టుంది.... అయ్యో’... అనుకున్నాడు. అతని మనస్సులో మూగరోదన.

* * *

రోజులు గడుస్తున్నా ట్రెయినులో పరిచయమయిన వసంతసేన జ్ఞాపకాలు గౌతమ్‌ని ఇంకా విడిచిపెట్టలేదు. భోజనం సయించదు. నిద్ర పట్టదు, ప్రేమలో పడితే ఇంతేనా!' అనుకున్నాడు.

ఒకరోజు క్లాసురూములో వున్నాడు. విద్యార్థులకు మృచ్ఛకటిక నాటకంలోని విశిష్టతను వివరిస్తున్నాడు.

"హృదయే గృహ్యతే నారీ

యదీపం నాస్తి గమ్యతామ్" అని శూద్రకుడు ఒక పాత్ర ద్వారా చెపుతాడు. 'స్త్రీని హృదయంతో అందుకోవాలి. అదిలేకపోతే ఆమె సన్నిధి నుంచి తప్పుకొని వెళ్లిపో' అని ఈ శ్లోకం అర్థం."

ఆ వాక్యాలు చెప్పిన గౌతమ్‌కు వెంటనే వసంతసేన గుర్తుకొచ్చింధి.

వసంతసేన తన గుండె గదిలో నిక్షిప్తమయిపోవడం కాదు. తనే ఆమె హృదయపు గదిలో జీవితాంతం వుండిపోవాలి. అలా అయితే ఆమెను ఎలా పట్టుకోవటం. ఆమె పేరు మాత్రం తెలుసు. అనకాపల్లిలో దిగింది. అంతే తెలుసు.

గౌతమ్ ఒక వారం రోజుల పాటు తీవ్రంగా ఆలోచించాడు. ఒక ప్రకటన రాసి ఒక తెలుగు దిన పత్రికలో వేయించాడు.

ఆద్మీ ముసాఫిర్ హై

ఆతా హై జాతా హై

ఆతే జాతెరాస్తేమే యాద్ ఛోడ్‌జాతాహై!

'మనిషి ఒక బాటసారి. వస్తూ పోతూ వుండే మనిషి తన దారిలో కొన్ని జ్ఞాపకాల్ని వదిలి వెళతాడు. అలాంటి అందమైన తియ్యటి నా జ్ఞాపకమైన వసంతసేనా ఎక్కడున్నావ్?

- నీ నేస్తం గౌతమ్

ఆ ప్రకటనతో పాటూ తన అడ్రసూ, ఫోన్ నెంబరు కూడా ఇచ్చాడు. అది చదివి ఆమె తప్పకుండా తనకు ఫోన్ చేస్తుంది. లేదా ఉత్తరం రాస్తుంది. అనుకునేవాడు గౌతమ్.

రోజులు గడుస్తున్నాయి. ఎక్కడనించి ఫోన్ వచ్చినా వసంతసేన నించే ఫోన్ వచ్చిందనుకునేవాడు. అతడి ప్రేమ కథ గురించి అతడి సహచరులకు తెలిసింది. అతను సీరియస్‌గా క్లాసులో పాఠం చెబుతుంటే క్రింద కారిడార్‌లో వసంతసేన నీ కోసం ఎదురు చూస్తుందనే వారు. అతను పరిగెత్తుకుంటూ వెళ్ళేసరికి అక్కడెవరో ముసలావిడ వుండేది. అతని మిత్రులు అలా ఏడిపించేవారు.

గౌతమ్ ఎమ్మేతో చదువు ఆపేశాడు. యూనివర్శిటీలో ప్రమోషన్ రావాలంటే పిహెచ్‌డి చెయ్యాలనే నిబంధన వచ్చేసింది. ఇక తప్పదని రీసెర్చ్‌లో చేరిపోయాడు. అలా మూడేళ్ళు వసంతసేన జ్ఞాపకాలతోనే డాక్టరేట్ పూర్తి చేశాడు. తల్లిగారి బాధపడలేక పెళ్ళి చూపులకు వెళ్ళేవాడు. పెళ్ళి కూతురుని వసంతసేనతో పోల్చుకుని, నచ్చలేదని తిరిగొచ్చేవాడు. ఈ లోగా ఇద్దరు చెల్లెళ్ళు పెళ్లీడుకొచ్చారు. తన పెళ్లి సంగతి మరిచిపోయి వారి కోసం పెళ్లి కొడుకుల్ని చూడటం మొదలు పెట్టాడు.

మరో మూడేళ్ళు గడిచిపోయాయి. చెల్లెళ్లిద్దరి పెళ్ళిళ్లు జరిపించేశాడు. ఆ తర్వాత సంవత్సరం తల్లిగారి ఆకస్మిక మరణం, ఆ దుఃఖంలో మరో సంవత్సరం తన పెళ్ళి సంగతి మరిచిపోయాడు.

ఇపుడు గౌతమ్‌ని పెళ్లి చేసుకోమని ఒత్తిడి చేసేవాళ్లు లేరు. కారణం అతనికిపుడు యాభైఏళ్లు ఎప్పుడూ ఆలోచనలతోనే గడుపుతాడు. ఆ ఆలోచనల్లో ఎక్కువ భాగం వసంతసేన గురించే. యూనివర్శిటీలో అతని గురించి కథలు కథలుగా చెపుతారు.

రైల్లో కనిపించిన ఒక అజ్ఞాత సుందరిని ప్రేమించాడట. ఆమె ఆచూకీ ఇంతవరకూ దొరకలేదు. ఆమె కోసం కొన్ని సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న పిచ్చి ప్రేమికుడు అంటారు. అతని గురించి తెలిసిన వాళ్లు.

* * *

గౌతమ్‌కిపుడు అరవై సంవత్సరాలు. ఈ సంవత్సరమే తెలుగు డిపార్ట్ మెంట్ హెడ్‌గా పదవీ విరమణ చేశాడు. తెలుగు సాహిత్యం మీద వచ్చిన పుస్తకాలు, విమర్శలతోనే పొద్దు పుచ్చుతాడు. ఎవరినీ కలవడు. చూట్టాలింటికి వెళ్లడు. వంటమనిషి వచ్చి వంటచేసి వెళుతుంది. తండ్రిగారి నుంచి సంక్ర మించిన ఆ పాత డాబా ఇంట్లోనే అతడి మకాం. రిటైరయిన తర్వాత అతని పరిస్థితి పూర్తిగా మారిపోయింది. చాలా రోజులు గెడ్డం గీసుకోకుండా, స్నానం చెయ్యకుండా ఆలోచనల్లోనే గడుపుతాడు. చెల్లెళ్ళు వచ్చి అతన్ని చూసి ఏడుస్తారు. కొన్ని రోజులు వాళ్లె దగ్గరుండి చూసుకుంటారు. వారు వెళ్లిపోయిన తర్వాత పరిస్థితి మళ్లీ మామూలే! అతనిపుడు నవ్వడం మానేశాడు. నిరంతరం ఆ అజ్ఞాత ప్రేమికురాలి గురించిన ఆలోచనలే. 'తనను మరిచి పోయి వుంటుంది. అసలు తనలాంటి వ్యక్తి ఈ భూ ప్రపంచంలో వున్నట్టు ఆమెకు గుర్తుందో లేదో?' ఆ ఆలోచనకే అతను వణికిపోతాడు.

ఒకరోజు సిటీ బస్‌లో వెళుతున్నాడు గౌతమ్. ఎప్పటిలాగే పుస్తక పఠనంలో మునిగిపోయాడు. పావుగంట తర్వాత తనపక్క సీటులో కూర్చున్న అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయాడు. మనసు ఆనందంతో పరవశించింది. మెదడు పొరలలో నిక్షిప్తమైన ఆ రూపం ఇంకా చెదిరి పోలేదు. ఇన్ని సంవత్స రాలుగా తనకు దొరక్కుండా తప్పించుకున్న వసంతసేన! ఇది ఎలా సాధ్యం. తనకు అరవయ్యేళ్ళు. ఎదురుగా కూర్చున్న వసంతసేనకు పాతి కేళ్ళు ఆమె యవ్వనం దాటిపోలేదా? అదే వయసుతో వుండి పోయిందా! ఆ మీమాంశ లోనే ''వసంతసేనా'' అన్నాడు గట్టిగా.

ఆ అమ్మాయి అతడి వంక ఆశ్చర్యంగా చూసి "వసంతసేన మా అమ్మపేరు ఆవిడ మీకు తెలుసా? ఇంతకీ మీరెవరు?" తన ప్రశ్నల వర్షం కురిపించింది.

ఆ మాటలకు గౌతమ్ ఆలోచనలో పడి 'ఔను నా పిచ్చిగానీ, ముప్పయ్యేళ్ల క్రిందటి వసంతసేన అలా ఎందుకుంటుంది?!' అనుకున్నాడు.

"ఏమండీ మిమ్మల్నే ఇంతకీ మీరెవరు?" అంటూ ఆ అమ్మాయి మళ్లీ అడిగింది.

"నా పేరు గౌతమ్, మీ అమ్మగారు నాకు తెలుసు" అన్నాడు క్లుప్తంగా.

"అయితే మా ఇంటికి రండి. అమ్మ నా దగ్గరే వుంది. రెండు రోజులయింది వచ్చి. నాన్న పోయిన దగ్గర్నించీ హైదరాబాద్‌లో అన్నయ్య దగ్గరుంటోంది. ఈ మధ్య ఒంట్లో బాగోలేదని ఇక్కడకు తీసుకొచ్చాను." అంది.

ఆ మాటలకు గౌతమ్ క్షణంసేపు బాధకు గురయి ఆ తర్వాత స్థిమితపడి 'అయ్యో. ఆమె భర్తను కోల్పోయింది. ఒకసారి వెళ్లి చూడాలి. అనుకున్నాడు.

ఆ అమ్మాయి తరువాతి స్టాపులో దిగిపోతుంటే ఆమె ఇంటి అడ్రసు తీసుకున్నాడు.

*   *   *

తరువాతి రోజు వసంతసేనను చూడడానికి బయలుదేరాడు. ఇంటికి తాళం వేసి బయటకు వస్తుంటే టెలిగ్రామ్‌తో పోస్ట్‌మేన్ ఎదురయ్యాడు. చెల్లెలి మావగారు చనిపోయారనే వార్త. వెంటనే బేగ్ సర్దుకుని హైదరాబాద్ బయలుదేరాడు గౌతమ్.

హైదరాబాద్ వెళ్లిన గౌతమ్ వారం వరకూ తిరిగి వైజాగు రాలేక

పోయాడు. చెల్లెళ్లు ఇద్దరూ వుండేది హైదరాబాదులోనే. ఇద్దరూ అతడిని వెళ్లనివ్వలేదు. ఒకరోజు బలవంతంగా వారు ఆపినా తిరిగి బయలుదేరి వచ్చేశాడు.

* * *

వైజాగ్ వచ్చిన రెండో రోజే వసంతసేన కూతురింటికి బయలు దేరాడు. ఆ రోజు తలారా స్నానం చేశాడు. చాలా కాలం నించీ పెంచిన గెడ్డం తీసేశాడు. యూనివర్శిటీలో పనిచేసేటపుడు వేసుకునే సఫారీ డ్రెస్సు వేసుకున్నాడు. ఇంటికి తాళం వేసి ఆటో ఎక్కాడు. దార్లో పళ్లు, స్వీట్లు కొన్నాడు.

అతడికి టెన్షన్‌గా వుంది 'ముప్పయ్యేళ్ల క్రిందట రైల్లో కలిసిన తనను ఇంకా గుర్తుంచుకొంటుందా? కొంపదీసి తను చేస్తున్నది పిచ్చిపనా!... లేదు. లేదు. ఆమె మనస్సు పొరలో తన గురించిన జ్ఞాపకం అలానే వుంటుంది!'

- అలా ఆలోచిస్తూనే అడ్రసు కాగితం చూసుకుంటూ ఆటో దిగాడు.

పసుపు రంగువేసిన పాతడాబా ఇల్లు. చుట్టూ ప్రహరీగోడ. మెల్లగా వెళ్ళి తలుపుకొట్టాడు. రెండు నిముషాలకు తలుపు తెరుచుకుంది. ఎదురుగా బస్సులో తను కలిసిన వసంతసేన కూతురు.

"ఎవరు మీరు?" అంటూ ప్రశ్నార్థకంగా చూసింది.

"నేనేనమ్మా, బస్సులో కలిశాను. మీ అమ్మగారిని చూద్దామని వచ్చాను. నా పేరు గౌతమ్, పేరు చూసి కుర్రాడనుకునేరు. నాకు అరవై ఏళ్లు..." అన్నాడు గౌతమ్ నవ్వుతూ అలా అంటూ తను తెచ్చిన పళ్లు, స్వీట్లు ఆమెకు అందించాడు.

క్షణాల్లో ఆమె కనుకొనల్లో నీరు ఉబికింది. రెండు చేతుల్తో ముఖం కప్పుకుంటూ ఏడ్చింది. ఆ ఏడుపు తెరలు తెరలుగా సాగింది.

గౌతమ్‌కు ఆమె అలా ఎందుకు ఏడుస్తుందో అర్థంకాలేదు. చుట్టూ

చూశాడు. ఆ గదిలో ఒక మూల చిన్నబల్లమీద ఫోటో....దానికి వేసిన పూల దండ, ఫోటో ముందు వుంచిన అగరొత్తులు. ఆ ఫోటోలోని వ్యక్తిని చూసిన గౌతమ్‌కు ఒక్కసారి భూమి కరిగి తను అందులో కూరుకుపోయి నట్టనిపించింది.

ఏడుస్తూనే వసంతసేన కూతురుచెప్పింది.

“మిమ్మల్ని బస్సులో కలిసిన రెండో రోజే అమ్మకు హార్ట్‌ఎటాక్. నిద్దట్లోనే, మాసివ్ అన్నారు డాక్టర్లు. అమ్మ స్వస్థలం అయిన అనకాపల్లి తీసుకెళ్లారు. నాన్న అంత్యక్రియలు కూడా అక్కడే జరిగాయి”.

ఆ మాటలతో గౌతమ్ మరింత కదిలిపోయాడు. ‘తను ఇన్నేళ్లుగా ఎదురు చూసిన వసంతసేన తనొచ్చే సమయానికి తెరమరుగై పోయింది. మనసులో బాధ సుళ్లుతిరుగుతోంది. ఆమె జ్ఞాపకం ఒక స్మృతిలా మిగిలింది. ఇక శూన్యం, ఆమె తనను మర్చిపోయిందో గుర్తుంచుకుందో ఇక తనకు తెలీదు ఎప్పటికీ!

బాధపడుతూనే బయటకు నడిచాడు గౌతమ్. “ఆగండి! ఒక్క నిముషం” అంటూ ఆ అమ్మాయి పిలుపుతో వెనక్కితిరిగాడు.

“ఈ పాకెట్టు అమ్మపెట్టెలో వుంది. రెండు రోజుల క్రితమే చూశాను. విప్పేసరికి ఫోటోఫ్రేమ్. ఏదో కవితలాగా కనిపించింది. మీరిప్పుడు గౌతమ్ అనగా అది గుర్తుకొచ్చింది. ఇన్నేళ్లుగా అమ్మదాస్తూ వచ్చినట్టుంది. ఇక దీని అవసరం లేదు.” అంటూ ఆమె కన్నీరు తుడుచుకుంటూ ఆ పాకెట్టు అతడికి అందించింది.

గౌతమ్ పాకెట్టు విప్పాడు. ఆ ఫోటో ఫ్రేమ్‌లోని ఆ వార్తా పత్రికలోని ఆ అక్షరాలు చదివిన గౌతమ్ శరీరంలోని అణువణువూ ఆనందంగా పులకరించింది.

'ఫోటో ఫ్రేమ్‌లో వున్నది తను ముప్పయ్యేళ్ల క్రితం వసంతసేనను అన్వేషిస్తూ ఇచ్చిన ప్రకటన. ఆ హిందీ సినిమా పాట. ఆ కాగితాన్ని ఫోటో ఫ్రేమ్‌లో పదిలపరిచి ఇన్నేళ్ల నించీ దాచుకుందామె. అంటే వసంతసేన నన్ను మరిచిపోలేదు. ఆమె నన్ను మరిచి పోలేదు.'

గౌతమ్ పదే పదే అలా మనసులో అనుకున్నాడు. అతడి పెదాల మీద చిరునవ్వు. ఆ ఫోటోఫ్రేమ్ తీసుకుని గౌతమ్ బయటికి వచ్చాడు.

సాయంత్రం అయింది. ఆకాశం నిర్మలంగా వుంది. బారులుగా సాగుతూ వెళుతున్న పక్షుల జంటలు. గౌతమ్ ఆనందంగా నడుస్తున్నాడు. అతని అడుగులు ఉత్సాహంగా పడుతున్నాయి. ప్రపంచం అంతా అతడికి సంతోషంగా కనిపిస్తోంది. గతంలోకి జారుకున్నాడు.

చిన్నపుడు తల్లి తన పుట్టిన రోజునాడు తలస్నానం చేయించి, కొత్తబట్టలు తొడిగి పరమాన్నం తినిపించిన రోజులు గుర్తుకొచ్చాయి. ఆ తర్వాత ఎన్నో అనుభూతుల బాల్యందాటి యవ్వనంలోకి ప్రవేశించాడు. వసంతసేనతో రైలు ప్రయాణం మదిలో మెదిలింది. ఆమెకోసం జీవిత కాలపు అన్వేషణ. ఇపుడు ఆమె ఇన్ని సంవత్సరాలుగా దాచుకున్న తన ప్రకటన ఉన్న ఫోటోఫ్రేమ్ గురించిన జ్ఞాపకం. అంతకు ముందు అన్ని విషయాలూ మరిచిపోయాడు. ఆ ఫోటో ఫ్రేమ్ మాత్రం మనస్సు పొరలలో ఫ్రేమ్ కట్టినట్టుగా పదిలంగా వుండిపోయింది.

ఇంటికొచ్చిన గౌతమ్‌కు పక్కింటివారి ఐదేళ్ల అబ్బాయి కని పించాడు. అతడి చెవిలో గుసగుసగా చెప్పాడు. "వసంతసేన నన్ను మరచి పోలేదు సుమా" అని.

ఆ కుర్రాడు భయపడి వెళ్లిపోయాడు. ఇంతలో అతడికి చాలా ఇష్టమైన పాట వినిపించిందో, వినిపించినట్టు భ్రమకలిగిందో!

- తలచి తలచి చూస్తే తరలి దరికి వస్తా!

నీకై నేనుబ్రతికి వుంటినీ, నీలోనన్ను చూసుకొంటినీ, కళ్లముందు సాక్ష్యాలున్నా తిరిగి నేనువస్తా ఒకసారి కాదురా, ప్రియతమా ఎపుడూ పిలిచినా!"

ఆ పాట గుర్తు చేసుకుంటూ తనలో తాను నవ్వుకున్నాడు. ఆ నవ్వు గౌతమ్ పెదాల మీద అలాగే వుండిపోయింది.

ఆరోజు లగాయితు ఈలోకం నించి వెళ్లిపోయే వరకూ నవ్వుతూనే గడిపాడు. మాటలు మరచిపోయాడు. మౌనాన్ని ఆశ్రయించాడు. ఒక్క వాక్యం మాత్రం అతిడికి గుర్తుంది.

'వసంతసేన నన్ను మర్చిపోలేదు సుమా!' అని, ఆ తర్వాత !

"ఫలించిన ప్రేమ శోభనం గదిలో అంతమైతే ఫలించని ప్రేమ చితిమీద కూడా పరిమళిస్తూ వుంటుంది."

(కవి, రచయిత, నటుడు, దర్శకుడు శ్రీ తనికెళ్ల భరణి గారు ఒక ఇంటర్వ్యూలో చెప్పిన రెండు కవితావాక్యాలే ఈ కథకు స్ఫూర్తి. అందుకే వారికి ప్రేమతో ఈ ప్రేమకథ అంకితం రచయిత.)

(నది మాస పత్రిక - జూన్ 2008)